# అల్లుడు మాక గిత్తలు

**చాలా సేపట్నుంచి కురిసిన వర్షం అప్పుడే ఆగింది. గాలి మాత్రం ఇంకా వీస్తానే ఉంది.**

**అంతసేపూ వర్షంలో తడిసిన వడ్రంగిపిట్ట ఆగున్న బండిచక్రం మీద వాలి రెక్కల్ని టపటపా కొట్టుకుంటుంది. తడిసిన నల్లకోడి వెచ్చటి గూట్లోకి దూరిపోయి పిల్లల్ని రెక్కల్లో దాచుకుంటుంది. దూళ్ళపాక మీద ఆనపపాదు ఒత్తుగా పాకి కాయల్ని కిందకి దించేసింది. పాక లోపల పడుకున్న సూడిగేది నడ్డిమీద వాలిన మాలకాకి ముక్కుతో పొడుస్తుంది. అలా పొడుస్తుంటే చాలా సైతిగా ఉందేమో తలనీ ఆనందంగా ఊపుతుందా గేది.**

బస్సు దిగి ఊళ్లోకి నడిచొస్తున్న ఒక మనిషిరాముల వారి గుడి అరుగుమీద కూర్చుని గుట్టలుకింద పోస్తున్న కూరగాయిల్ని ఊరికే పంచి పెడ్తున్న ఆ ఆడామగని చూస్తా ఎదురొచ్చిన సత్తోరిబోడమ్మ నడిగేడు.

అతన్ని ఎగాదిగా చూసిన బోడమ్మ ''ఏవూరుమంది?'' అంది.

''గోదావరవతల్లెండి... తణుకు దగ్గరున్న ఖండవిల్లి'' అన్నాడు.

''అలా చెప్పు...పంచి పెడ్తున్న అతను పడాల రామారెడ్డి ఊళ్ళో అంతా రావుడు అంటారు. ఆవిడ రావుడి భార్య ధనలక్ష్మి'' చెప్పింది బోడెమ్మ.

''సంతోషంగానీ... నేనడిగింది పేర్లుగాదు... ఆయనగారు ఊరికే ఎందుకు పంచి పెడ్తున్నారా అని'' అన్నాడు ఖండవిల్లి మనిషి.

''అదా..ఆళ్ళకి పెదురుపాక వెళ్ళే దార్లో బంగారం పండే పాతికెకరాల పొలం ఉంది. అందులో అయిదెకరాలు ఊడ్చకండా ఆళ్ళ దూళ్ళకి జలగడ్డీ, దాంతో పాటు కూరగాయలు పండిస్తాడు. కాయలు కోత కొచ్చాకా కోసి రాములోరి గుడి అరుగు మీద గుట్టలకింద పోసి అదిగో అలాగ లేబరుకి పంచి పెడ్తుంటాడు అర్థమైందా?'' అంది బోడెమ్మ.

''బాగా అర్థమైందమ్మా ఆరెవరో పుణ్యాత్ములు ఆళ్ల పిల్లలు చల్లగా ఉండాలి'' అన్నాడు ఖండవిల్లి మనిషి.

''పాపం ఆళ్ళ కసలు పిల్లలే లేరు''. అంది సత్తోరి బోడెమ్మ.

''అలాంటప్పుడు శ్రీరామనవమి రోజు పీటల మీద కూర్చోవచ్చుగదా?'' అన్నాడు.

''ఆ పనీ చేస్తున్నారు. అయినా కరుణించడం లేదా రాములోరు'' అంది బోడెమ్మ.

''తప్పకండా కరుణిస్తారమ్మా రాములోరు. ఇలాంటి పుణ్యాత్ముల్ని ఆదేవుడు వదిలిపెట్టడు'' అన్నాడా మనిషి.


''ఊళ్ళో డబ్బున్న రెడ్లతో పోల్చుకుంటే ఈళ్ళేం పెద్ద ఉన్నోళ్ళు కాదుగానీ, ఉన్నదాంట్లోనే దానధర్మం చేస్తారు''.

''ఇలాంటోళ్ళని గొడ్డిమోతోళ్ళకింద ఎందుకుంచుతాడు ఆ దేవుడు. చూస్తుండండి వచ్చే ఏటికి ఈళ్ళకి కవల పిల్లలు పుట్టకపోతే నన్నడగండి'' అనేసి తూర్పుపేట పక్కకెళ్ళిపోయేడా ఖండవిల్లి మనిషి.

రాత్రయినా తగ్గలేదు ఈదురుగాలి. ఆకాశమంతా మబ్బుల్తో నిండిపోయుంది. ఎక్కడో తుఫానట పంచాయితీ బోర్డు దగ్గర రేడియోలో చెప్పేరు.

అన్నం కంచం ముందు కూర్చున్నాడు రావుడు.

దూళ్ళ సావిట్లోంచి పరుగెట్టుకుంటూ వచ్చిన పాలేరు




గోవిందు ''ఆవూ, దాని దూడాకూడా ఈత కొచ్చేసినియ్యండి'' అన్నాడు.

''ఏంట్రా?'' అన్నాడు.

''అవునండి... రెండూ వుడుల్లోంచి తీగలెయ్యడం మొదలెట్టేనియ్యి'' అన్నాడు.

అన్నం గబగబా తినేసి దూళ్ళ సావిట్లో కొచ్చేడు రావుడు.

చలిగాలి లోపల కొచ్చేస్తుంటే దళసరిగా ఉన్న బరకంగుడ్డలు తెప్పించి సావిడి చుట్టూరా కట్టించేసేడు



కాస్సేపు సుళ్ళు తిరుగుతా వీచిన గాలి ఉన్నట్టుండి ఆగిపోతుంది. కాస్సేపయ్యిందో లేదో మళ్ళీ మొదలు.

పాలేర్లూ రావుడూ అతని భార్య ధనలక్ష్మి లాంతర్లు పట్టుకుని జాగారం చేస్తున్నారు.

ఒకదాని తర్వాత ఒకటి మాయ ఎయ్యడం మొదలెట్టినియ్యి.

వేసిన ఆ మాయ దగ్గరే కాపలా కూర్చున్నారు రావుడూ ధనలక్ష్మీ. పొరపాట్న ఆ మాయగానీ తింటే ఆ ఈతకి పాలివ్వకండా ఒట్టిపోద్ది ఆవు.

ఉన్నట్టుండి గాలి బాగా పెరిగింది.

గబగబా జరిగిపోతున్న మబ్బులు ఏ పక్కకో వెళ్ళిపోయేటప్పటికి అంతసేపూ మబ్బు వెనక దాక్కున్న చుక్కలు బయటికొచ్చినియ్యి. అప్పటికి తెల్లవారు ఝూవయ్యింది. రాజేశ్వరస్వామి గుళ్ళోనూ గోపాలస్వామి గుళ్ళోనూ మోగే గంటలు కలగలుపుగా వినిపిస్తున్నాయి. తూరుప్పేటగుడిలోంచి నమో వెంకటేశా పాట గాలి పక్క కేసినప్పుడు మాత్రమే వినిపిస్తుంది. ముసలోళ్ళు కొందరు అప్పుడే తెరిచేసిన కిళ్ళీరన్న కాఫీఒటేలు పక్కకెళ్ళి పోతన్నారు.

ఆవూ దాని దూడా పుష్టిగా ఉన్న రెండు గిత్తదూడల్ని ఈనినియ్యి.

మాయని బరకంగుడ్డలో మూటగట్టేసి స్మశానం అవతలున్న మర్రిచెట్టుకి కట్టొచ్చేడు పాలేరు గోవిందు. సావిడంతా శుభ్రం చేసి, వేడ్నీళ్ళతో గిత్తదూడల్ని కడిగేసేరు ఇద్దరాడోళ్ళు. బాగా ఆరిపోయి చెలాగ్గా తిరుగుతున్న ఆ దూడల్ని కుడిచేత్తో దువ్వుతా ''ఆదేవుడు మనకి పిల్లల్ని ఈటిరూపంలో ఇచ్చేడేమోనే'' అన్నాడు రావుడు.

''నాకూ అదే అనిపిస్తందండీ'' అంది ధనలక్ష్మి.

గిత్తదూడలు రెండూ దూళ్ళసావిట్లోకంటే ఇంట్లోనే కల తిరుగుతున్నాయి.

* * *

ఎదిగి పెద్దయిన ఆ గిత్తలకి అల్లుడు మావ గిత్తలని పేరు పెట్టేరు ఊళ్ళోజనం.

ఊళ్ళో గోపాలస్వామి తీర్దానికీ, రాజేశ్వరస్వామి తీర్దానికీ, ఆ గిత్తల్ని చంటి పిల్లల్ని స్కూలుకి పంపడానికి ముస్తాబు చేసినట్టు చేసి ఊరేగింపులో ముందు నిలబెట్టి నడిపిస్తున్నారు.

ఆ ఊరేగింపు అయ్యేకా వాటిమీద ఎవడికళ్ళు పడ్డాయో ఏంటో అని దిష్టి తీస్తుంది ధనలక్ష్మి. చాలా అత్తారబతంగా చూసుకునే ఆ అల్లుడుమావగిత్తల భుజాల మీద ఏదో శాస్త్రనికని పండగరోజునాడు అలా కాడి పెట్టి ఇలా తీసేస్తున్నారు.

ఆ గిత్తలకోసం ప్రత్యేకంగా వాడపిల్లి పెంకుల్తో షెడ్డు వేయించేడు రావుడు. గిట్టలు జారిఅవి పడిపోకుండా కింద గరుకు గచ్చు చేయించేడు. దోమలు కుట్టకుండా పైన గాలిపంకాలు పెట్టించేడు. శ్రీకాకుళం దగ్గర హీరమాండలం అనే ఊర్నుంచి ఒక జోడా కూలోళ్ళని పిలిపించి ''ఆ గిత్తల బాగోగులు చూసుకోడంలో ఏమాత్రం తేడా చేసినా కొరడాకర్రతో బాదేస్తాం అలా ఇష్టమైతేనే ఉండండి'' అని వార్నింగిచ్చేడు.

ఎండుగడ్డీ, ఎండు జనుం మేపుతానే తెలగపిండీ గంటెలూ, జొన్నలూ ఉలవలూ బాగా ఉడకేసి పెడ్తున్నారు. మధ్యమధ్యలో తవుడూ తుమ్మపళ్ళు కలిపి పెడ్తున్నారు. ఒకటో నెంబరు చిట్టు, తమ ధాన్యం మరపట్టించినపుడు తీసి దాస్తున్నారు.

మెత్తటి కొబ్బరి పీచుతో మాలిష్‌చేయిస్తున్నారు. అలా చెయ్యడం వల్ల పుష్టిగా ఉండే గిత్తలు అందంగా మిలమిలా మెలిగిపోతున్నాయి.

ఆ అల్లుడు మావగిత్తల్ని చూడ్డానికి చుట్టుపక్కలూళ్ళనించి పనిగట్టుకు మరీ వస్తున్నారు.

* * *

ఇంజనీరింగు చదువుకుని ఖాళీగా ఉన్న పీరారామచంద్రపురం మనిషైన అర్జునరెడ్డి రావుడి వరసకి మేనమావ అవుతాడు. ఒకరోజు పొద్దుటే విక్కీ బండి మీద దిగిపోయిన అర్జునరెడ్డి ఎప్పుడు చూసినా వ్యవసాయమేనా? ఏడాది పొడుగునా కష్టపడితే ఏం మిగులుద్దీ అంటూ ఒక ఫేక్టరీ ఫొటోలూ తను గీసిన ప్లానూ విక్కీ బండ్లోంచి తీసి రావుడిముందు పరిచి చూపించి ''ఇది బిస్కెట్ల ఫేక్టరీ బెంగుళూర్లో కట్టేరు. ఇదిగానీ ఇక్కడ మొదలెడితే కోట్లకి కోట్లు లాభాలు'' అంటూ ఆ లాభాలన్నీ కళ్ళముందు గిరగిరా తిరిగేలాగ మాంచి చాకచక్యంగా చెప్పుకుంటా పోతున్నాడు అర్జునరెడ్డి.

అర్జునరెడ్డి చెప్పేది వింటే ఎవడికన్నా ఆశ కలుగుద్ది. రాముడిక్కూడా కలిగింది.

బేంక్‌కెళ్ళి మేనేజర్‌తో మాటాడి బిస్కెట్లఫేక్టరీ ప్లాను ఇచ్చేడు అర్జునరెడ్డి.

కొన్నాళ్ళు బేంక్‌వాళ్ళ చుట్టూ తిరగడం అయ్యేకా ''మీరు సగం పెడితే మేం సగం పెడతాం'' అన్నారు.

''కోటి రూపాయిలవుద్ది మనం ఏభై పెట్టాలి మరి'' అన్నాడు అర్జునరెడ్డి.

''నాకు పాతిక పెట్టే శక్తి మట్టుకే ఉంది. మరి నువ్వెంత పెడతావ్ మాయ్యా?'' అర్జునరెడ్డి నడిగేడు రావుడు.

నవ్విన అర్జునరెడ్డి ''నాది వర్కింగ్ కేపిటల్'' అన్నాడు.

''అలాగా అనుకుంటా ఆలోచించిన రావుడు తక్కిన పాతికా బయట వడ్డీకి తెద్దాంలే'' అన్నాడు.

అటు పక్కన బేంకోళ్ళతో అర్జునరెడ్డి లౌక్యంగా జరుపుతున్న మాటలకి పనయిపోద్ది అనిపిస్తంది. అదలాగుండగా అర్జునరెడ్డికి తెల్సిన పితాపురం వాస్తు సిద్ధాంతిగారు దిగి ఇంజనీర్లు గీసిచ్చిన ఫ్యాక్టరీ బిల్డింగు ప్లానుని కాస్త మార్చి ఇలా కానిచ్చెయ్యండి అనేసి మంచి మొత్తం పట్టుకుని వెళ్ళిపోయేడు.

ప్యాక్టరీ పనుల్లో పూర్తిగా మునిగిపోయిన రావుడి పక్కన ధనలక్ష్మీకూడా చేరింది. పొలం వెళ్ళడం మానేసేరు గిత్తల్ని పట్టించుకోడం మానేసేరు.

మందు మరిగిన శ్రీకాకుళం కుర్రోడు డబ్బులు చాలక గిత్తలకోసం కొనే ఉలవలూ, తవుడూ, గంటెలూ, జొన్నలూ అమ్ముకోడం మొదలెట్టాడు.

ఫ్యాక్టరీ బిల్డింగు పూర్తయ్యింది. మిషనరీ కూడా దిగిపోయింది. ఎక్కడెక్కడినించో గొప్పగొప్ప పనోళ్ళు దిగుతున్నారు.

ఇలా ఫలానా నెల్లో రోజు ఓపెనింగు చేసెయ్యొచ్చు అనుకుంటున్న టైంలో పాలకొల్లు అవతల్నుంచి దిగిపోయిన రామలింగసిద్ధాంతిగారు ''మీకు వాస్తు చెప్పినోడికి విదిక్కులు తెలుసా అసలు'' అంటా చాలా పెద్ద గొడవ చేసేడు. ఇలా ఫ్యాక్టరీ ఓపినింగ్ చేస్తే అది ముందుకెళ్ళదు. మీ ఆస్తులు సర్వం అమ్ముకోవాలి అంటా చాలా మాటాడేస్తుంటే మరేం చెయ్యమంటారన్నాడు రావుడు.

వెంటనే దీన్ని పడగొట్టేసి ఈ విధంగా కడితేనే మీకు మంచి భవిష్యత్తు మంచి లాభాలూ మీ ఫేక్టరీ దేశదేశాలూ పేరెల్లుద్ది అని తన ప్లానిచ్చేడు.

ఇక అప్పట్నుంచీ మొదలయ్యినియ్యి పాట్లు.

ఎక్కడా అప్పులు దొరక్క పోయేసరికి పొలం ఇల్లూ తణకా పెట్టేడు రావుడు.

పనేదో నత్తలా నడుస్తుందిగానీ మనసుకి  శాంతి లేకండా పోతుంది.

ఇదిలాగుండగా శ్రీకాకుళం జోడా గిత్తల్ని అస్సలు చూడ్డం లేదని తెల్సింది. తాగొచ్చిన వాడూ, వాడి పెళ్ళాం కొట్టుకు చస్తున్నారని తెల్సి ఇద్దర్నీ బయటికి గెంటేసేడు రావుడు.

పైదాకా లేచిన ఫేక్టరీ గోడలు తుఫానొచ్చి పడిపోయినియ్యి. వచ్చిన మిషనరీలోకి నీళ్ళెల్లి తుప్పట్టిపోతుంది. బెంగుళూరునించి కేరళా నించీ వచ్చిన పనోళ్ళకి సరిగా జీతాలివ్వక పోయేసరికి తిరిగెళ్ళిపోతున్నారు.

ఎక్కడా డబ్బు దొరక్క ధనలక్ష్మి నగలన్నీ అమ్మేసేడు రావుడు.

ఇక్కడేదో ఇక సరిగా ఉండేలా లేదని తెల్సిన అర్జునరెడ్డి నిమ్మళంగా జారుకున్నాడు.

* * *

పోషణ సరిగ్గాలేని అల్లుడు మావగిత్తల్లో కళా అందం తగ్గిపోతున్నాయి. తిండిలో ఏం తేడా వచ్చిందో వాటి కంటిచూపులో కూడా తేడా వచ్చేసింది.  ఇంట్లో విలువైన సామాన్లు అమ్మేస్తున్నాడు రావుడు. ఇంకొన్నాళ్ళు పోయేక ఆ గిత్తల్ని అమ్ముకోవాల్సిన అవసరం వచ్చి బేరగాళ్ళకి కబురు చేసేడు.

ఆ గిత్తల చరిత్ర తెల్సిన దూళ్ళబేరగాళ్ళెవరూ కొనడానికి రాటం లేదు.

ఖర్చులకి మరీ ఇబ్బందయ్యి పోడంతో ద్రాక్షారామం, ద్వారపూడి, పిఠాపురం మండపేట సంతలకి తిప్పేడు. అక్కడకూడా అమ్మకం జరగలేదు.  ఇటు పక్కన జూస్తే అవసరాలు పీకేస్తున్నాయి.

చివరికి మండపేటనించి కటికోడ్ని పిల్చి ఆ గిత్తల్ని వాటితో పాటు మిగిలిన దూళ్ళనీ అమ్మేసేడు రావుడు.

మూడ్రోజులు గడిచినియ్యి.

మండపేట నించి మా పసలపూడి పారిపోయి వచ్చిన అల్లుడుమావగిత్తలు రావుడి ఇంటిదొడ్లో గడ్డిమేటు ఎనకాల తల దాచుకున్నాయి.

వారంరోజులు గడిచినియ్యి.

రాముడి దగ్గరకొచ్చిన మండపేట కటికోడు ''గిత్తలు తప్పించుకు వచ్చేసినియ్యి తెగవెతుకుతున్నాను మీ ఇంటిగ్గానీ వచ్చినియ్యాండీ?'' అనడిగేడు.

''మేం అమ్మేసేకా మా ఇంటికెందుకొస్తాయిరా ఎదవా?'' అన్నాడు రావుడు.

కటికోడికీ రాముడికీ మధ్య మాటామాటా పెరిగి గొడవైంది.

చివరి కెళ్ళిపోయేడు కటికోడు.

ఏదో పనుండి దొడ్లో కెళ్ళిన రావుడికి గడ్డిమేటు వెనకాల నరమానవుడికి కనపడనంత లోపలికెళ్ళి దాక్కునున్న గిత్తలు కనిపించినియ్యి.

వెంటనే కటికోడ్ని పిల్చి వాటిని అప్పగిస్తుంటే నోటంట మాటరాని ఆ మూగ జీవాలకి కళ్లమ్మట నీళ్ళు వచ్చినియ్యి...

వాటిని తోలు కెళ్ళిన ఆ కటికోడు ఆ రాత్రికి రాత్రే నరికేసేడట.

నెలరోజులు తర్వాత రావుడి ఆస్తులు మొత్తం జప్తు చేయబడినియ్యి.

కుటుంబం వీధిలో పడిపోయింది.

ఊబలంకలో ఉన్న వాళ్ళ పుట్టింటి కెళ్ళొస్తున్న ధనలక్ష్మి ఎక్కిన చిన్నకారు పులగుర్తరేవు దాటాకా తిరగలబడి కాలవలోకెళ్ళిపోడంతో ఆవిడి రెండుకళ్ళూ పోయినియ్యి.

పక్షవాతం వచ్చి కాలూచెయ్యీ పడిపోయిన రావుడు ఊళ్ళో అరుగులమ్మటపడి దేక్కుంటా తిరుగుతున్నాడు.

అతన్ని చూసినోళ్ళంతా ''ఆ అల్లుడుమావగిత్తల్ని ఏ చేత్తో పెంచేడో ఆ చేత్తోనే కటికోడి కప్పజెప్పేడు. అందుకే ఆ భగవంతుడు అలా జేసేడు రావుడ్ని'' అన్నారు.

* * *